# జానకి లేచి పోయింది

–గోవిందరాజు సీతాదేవి



ఉదయం ఆరు గంటలు కావస్తోంది.

స్నానం చేసి పెరట్లోకి వెళ్ళాను. అప్పుడే విచ్చుతున్న ముద్దమందారాలూ, తెల్లగా వెన్నముద్దల్లా వున్న నందివర్ధనాలూ, వాటి మీద నిలిచిన మంచు బిందువులూని చూస్తుంటే మనసుకి యేదో తెలియని ఆనందం కలగసాగింది.

'ఏంవోయ్! యింకా కాఫీ కాలేదూ!" ఆరు నెలల క్రితమే రిటైర్ అయిన శ్రీవారు తీరుబడిగా నిద్రలేచి కాలకృత్యాలు తీర్చుకుని కాఫీ కోసం కేక పెట్టారు.

ప్రకృతి అందాలని తీరుబడిగా చూసే అవకాశం కూడా లేని నా దురదృష్టానికి ఓ నిట్టూర్పు వదిలి సజ్జలోకి పూవులు కోసుకోసాగాను.

ప్రహరీ పక్క నుంచి ఓ కొంకి కర్ర కొమ్మలని వంచటం కన్పించింది.

"ఎవడురా!" అంటూ గబగబా గేటు దగ్గరకి నడిచాను.

డెభైయేళ్ళు దాటిన ముసలాయన నా అరుపులికి బిక్కముఖం వేసుకుని కర్రని వెనక్కి దాచే ప్రయత్నం చేస్తూ కన్పించాడు.

"మీరా! తాతగారూ!" కోపంగా చూస్తూ అడిగాను.

"నేనేనమ్మా! దేవుడి పూజకి పూవులంటూ మా ఆవిడ నన్ను ప్రాణం తీస్తుందమ్మా. మేం వుండేది నాలుగో అంతస్తులో కదా! అందువల్ల"

.ఆయన నా ముఖంలోకి చూస్తూ మాటని మధ్యలోనే ఆపేశాడు.

"దేవుడి పూజ కోసం దొంగతనంగా పూవులు కోయటం భావ్యమేనా చెప్పండి?"

"యెంత మాట అన్నారమ్మా! మీకు అందక వదిలేసే పువ్వులనే కదమ్మా నేను కోసుకునేది. ఇది దొంగతనంగా నువ్వు భావిస్తే మరి రాను క్షమించు" ఆయన ముఖం దించుకుని అన్నాడు.

"మీ కొడుకు పెద్ద ఆఫీసర్ కదా! పూజకి పువ్వులు కావాలనీ, కొనమనీ కోడలని అడగవచ్చుగా" కాస్త శాంతం తెచ్చుకుని అన్నాను.

"అంత అదృష్టం మాకు లేదు తల్లీ. ఇల్లిల్లూ తిరిగి పూలు కోసుకుని వెళ్ళి పూజ కానిచ్చి దేవుడికి నైవేద్యం పెట్టటానికి ఓ చెంచా చక్కెర యిమ్మని అడిగితే గంటసేపు పోట్లాడే కోడలు డబ్బులు పెట్టి అత్తగారి పూజకి పూలు కొంటుందామ్మా. ఇదంతా మా ఖర్మ" అంటూ వెళ్ళిపోతూన్న ముసలాయన్ని చూస్తుంటే మనసుకి బాధగా అన్పించింది. పొరబాటుగా అన్నాను. రేపు

కొన్ని పువ్వులు కోసి పనిపిల్లకి యిచ్చి పంపాలి" అనుకుంటూ లోపలికి వచ్చాను.

"ఏంవోయ్! కాఫీ అడిగి అర్ధగంట అయింది" శ్రీవారు ఈ టీవీలో గీతాపాఠం విన్పిస్తూన్న చినజీయరుస్వామి వారిని తన్మయంగా చూస్తూ గొణగటం విన్పించింది.

"ఏంవోయ్" అనే ఆ పిలుపు అంటే నాకు చెప్పలేనంత కోపం. నాకు పేరు లేనట్లు. ఏంవోయ్ ఏంటీ అని. అలా పిలవద్దనీ, ఆ పిలుపుకి నేను పలకననీ శ్రీవారికి ఎన్నోసార్లు చెప్పాను. ఆయనకి నా మాట గుర్తు వుండదు. మళ్ళీ అదే పిలుపు. నేనే రాజీపడి పోయాను.

మౌనంగా వంట గదిలోకి నడిచి కాఫీ కలిపి తెచ్చి శ్రీవారికి అందించి వెళ్ళి పూజ ప్రయత్నం ప్రారంభించాను. యెంత సమయం గడిచిందో తెలియదు. మళ్ళీ శ్రీవారి పిలుపు.

"ఏంవోయ్. జెమినీలో మహాలక్ష్మిలాంటి ఒకావిడ ధర్మాలని గురించి యెంత అనర్గళంగా వుపన్యసిస్తోందో ఒక్కసారి వచ్చి చూడు"

ఆమె కంచు కంఠం వంట గదిలోకి విన్పిస్తూ నా ధ్యానాన్ని భంగపరుస్తుందన్న చికాకుకి శ్రీవారి పిలుపు అగ్నిలో ఆజ్యం పోసినట్లు అయి పూజ ఆపేశాను. కోపంగా , హాలులోకి వచ్చాను.

"జానెడు వెడల్పు పట్టు చీరె. చేతులకి యెన్నో బంగారు గాజులు. కళ్ళకి జోడు. బొద్దుగా కుర్చీ నిండుగా కూర్చుని ఆవిడ చెప్పే విషయాల్లో మీకు తెలియని కొత్త విషయం ఒక్కటన్నా వుందా" టీవీ సౌండ్ తగ్గిస్తూ అన్నాను. శ్రీవారు నా వైపు విసుగ్గా చూస్తూ.

"నువ్వు బొత్తిగా నాస్తికురాలివి అయిపోతున్నావోయ్" అన్నారు.

"అవును. నాస్తికురాలినే" టీవీ ఆఫ్ చేస్తూ అన్నాను.

"పిల్లలిద్దరూ పెద్దవాళ్ళు అయి పెళ్ళిళ్ళు చేసుకుని అత్తవారిళ్ళకి వెళ్ళిపోయిన తర్వాత నువ్వు బొత్తిగా మారిపోయావు. కాపురానికి వచ్చిన కొత్తలో యెంత వినయంగా, యెంత విధేయురాలిగా, యెంత ఒద్దికగా వుండే దానివి. అవన్నీ ఏమైపోయినాయ్ ఇప్పుడు ప్రతి మాటకీ యెడ్డెం అంటే తెడ్డెం వూ ఇదంతా సరే గానీ ఇవాళ టిఫెను ఏంటీ. ఇడ్లీ ఒద్దు. ఉప్మా అసలే వద్దు. యెంచక్కా పెసరట్టూ అల్లం చెట్నీ చెయ్యి. నేనూ బైటకి వెళ్ళి వస్తాను" అనేశారు. ఇలా శ్రీవారు అనటం నాకు మామూలే. తన్మయత్వంగా భగవద్గీత వింటూనే యివాళ యెంచక్కా పాకం గారెలు చెయ్యి. నా ఫ్రెండ్ గుర్నాధాన్ని పిలుస్తాను. యెవరు యెక్కువ తింటే వాళ్ళు గెల్చినట్లు తక్కువ తిన్నవాళ్ళు వంద యివ్వాలి. ఇదీ నా పందెం అంటాను. ఏమంటావ్ అనగలరు. నేను ఓ మంచి పుస్తకం చదివి దాన్ని గురించీ, దానిలోని పాత్ర చిత్రణ గురించి, దానిలోని జీవితపు విలువలని ఎలా చిత్రీకరించాడో రచయిత అన్న విషయంపై అనర్గళంగా మాట్లాడేస్తూన్నప్పుడు. అదంతా వింటూన్నట్లే వుండి "ఇవాళ అన్నంలోకి గుమ్మడికాయ వడియాలు వేయించలేదు. చారులో కొత్తిమేర వాసన లేదు అనేయగలరు.

నేను నా సాహిత్య ప్రపంచంలోనించి అమాంతం కింద పడిపోయినంతగా బాధపడుతూంటాను. గాడిదకేం తెలుసు గంధం పొడివాసన అనుకుని పళ్ళు కొరుక్కుంటూనే అంతరాత్మ అతను నీ భర్త అలా అనుకోవచ్చా అన్న మందలింపుకి నిశ్శబ్దంగా చెంపలు వేసుకుని నిట్టూరుస్తూంటాను.

ఇలాంటి ఆయనతో నలభైయేళ్ళ సుదీర్ఘమైన జీవితం ఎలా గడపగలిగాను. అన్న విషయం గుర్తుకి వస్తే నాకు ఆశ్చర్యంగానే వుంటుంది.

## 2

శ్రీవారు హిందూ పత్రిక చదువుతూ వరండాలో కూర్చున్నారు. నేను పూల మొక్కలకి పాదులు చేసి నీళ్ళు పోసే పనిలో వున్నాను.

"ఏంవోయ్! వాకిట్లో ఆటో వచ్చి ఆగింది. యెవరొచ్చారో చూడు"

శ్రీవారి పిలుపుకి "ఎవరు వచ్చి వుంటారు" అనుకుంటూ మట్టి చేతులు కడుక్కుని లోపలికికి వచ్చాను.

"నా చిన్ననాటి ఫ్రెండ్ భారతి ఆటో దిగి అమాంతం వచ్చి వాటేసుకుంది.

"ఎలా వున్నావే మైథిలీ" అంటూ. భారతిని చూసి దాదాపు పదేళ్ళు అయింది. అయినా దానిలో అంతగా మార్పు లేదు కానీ జుట్టు మొత్తం తెల్లగా అయిపోయింది. కళ్ళకి జోడు వచ్చింది. భారతికి ఒకే ఒక్క కొడుకు. డాక్టర్ కోర్సు చదువుతున్నాడు. భర్త రిటైర్ అయిన వుత్సాహంతో స్నేహితులనీ, బంధువులనీ ఓసారి చూసిపోవాలని బయలుదేరారట. చివరి మజిలీ నన్ను చూడడం అని గబగబా చెప్పేసింది తన భర్తని శ్రీవారికి పరిచయం చేసేసింది.

"మైథిలీ కాసిని కాఫీ నీళ్ళు పొయ్యి" అంది. అలా అనటం దానికి చిన్నప్పటి నుంచీ వున్న అలవాటే. శ్రీవారికి బంధువులు వస్తే మహా సంతోషం.

"ఏంవోయ్. ఇవాళ ఏం స్పెషల్సు చేస్తావ్? అని అనవే అనేశారు. ఆయన భోజన ప్రియత్వం నాకు యిబ్బంది కలిగించినా ఓర్పు వహిస్తూ వుంటాను. యెంతైనా తెలుగు ఇల్లాలుని కదా! కాఫీ ఫలహారాలు అయిన తర్వాత వంట ప్రయత్నంలో వున్నాను. భారతి వంట గదిలోనే కూర్చుని ఏవేవో కబుర్లు చెప్తూ ఏదో గుర్తుకి వచ్చిన దానిలా ఆగి.

"ఇదిగో మైథిలీ నీ రూమ్‌మేట్ జానకి లేచిపోయిందిట"


"ఏమిటీ! జానకి లేచిపోయిందా! ఎప్పుడు! ఎక్కడికి! ఎందుకూ?' అయోమయంగా చూస్తూ ప్రశ్నలు గుప్పించాను.

"ఆ వివరాలు నాకు తెలియవు. కానీ దాని భర్త కాకినాడలో కన్పించి చెప్పాడు."

"యాభై యేళ్ళు దాటిన జానకి లేచి పోవటం యేమిటి?"

"నా కవన్నీ తెలియవు. ముందు కూర పోపులో వెయ్యి. తర్వాత తీరుబడిగా కూర్చుని ఆలోచించు. చూడూ నేను వెళ్ళి మీ శ్రీవారితో కబుర్లు చెప్తాను. మైథిలీ నువ్వెంత అదృష్టవంతురాలివే. యెంత సున్నిత మనస్కుడు నీ భర్త. ఇలాంటి భర్త నాకు దొరికితే పాదాలు కడిగి నీళ్ళు నెత్తిన చల్లుకుందునే. యెంత బంధుప్రీతీ యెంత దైవభక్తీ" అంటూ వెళ్ళిపోయింది.

భారతి మాటలు నా చెవులకి విన్పించటం లేదు. కానీ దాన్ని రెక్క పట్టుకుని ఆపి అడిగాను "భారతీ, జానకి ఇల్లు వదిలి పోవటానికి బలవత్తరమైన కారణం ఏమిటి!"



"జానక్కీ భర్తకీ ఎన్నో విషయాల్లో అభిప్రాయ బేధాలని మనకి తెల్సుగా" దాని మనసుకి విరక్తి కలిగేది యేదో జరిగి వుంటుంది. చూడూ నువ్వు దిగులుపడకు. అది నీకు కారణం తెలియజేస్తుంది. ఇంక ఈ విషయం ఒదిలెయ్యి" అంటూ ముందు గదిలోకి వెళ్ళింది. ఆ ముగ్గురూ కబుర్లు ప్రారంభించారు.

జానకి పాతికేళ్ళుదాటినా చిన్న వుద్యోగం చేసుకుంటూ బ్రతుకుతాను అంటే నేనే శ్రీనివాసురావు మంచి వాడనీ, బ్యాంకు వుద్యోగి అనీ పెళ్ళి చేసుకోమనీ బలవంతం పెట్టి దాన్ని ఒప్పించాను కొన్నాళ్ళు ఇద్దరూ ఆనందంగానే వున్నారని తృప్తి పడ్డాను. శ్రీవారికి ట్రాన్సర్ అయి విశాఖపట్నం వదలటం, హైదరాబాద్ రావటం యిక్కడే సెటిల్ అవటం, రిటైర్ అవటం జరిగింది. ఆ పెళ్ళి చేసుకోమని నేను యెంత తప్పు చేశాను అన్న అపరాధభావం కృంగదీయసాగింది.

భారతి ఒక్కరోజు వుండి వెళ్ళిపోయింది. శ్రీవారు రకరకాల వంటకాలు పురమాయించి నా చేత చేయించి విందు ఆరగించి వాళ్ళతో కబుర్లతో కాలక్షేపం చేశారు. నా మనసు లోలోపల వుడికి పోసాగింది. పురుషాధిక్య సమాజంలో స్త్రీ యంత్రంలా వుండి పోవల్సిందే. జానకి యెక్కడ వుందో, యెలా వుందో తెలుసుకుందామన్నా దాని అడ్రస్ తెలియదు. ఈ బాధ నా మనసుని తినేస్తోంది.

నాలుగు రోజులు నిశ్శబ్దంగా గడిచిపోయినాయి. ఒకరోజు జానకి దగ్గర నుంచి వుత్తరం వచ్చింది. కవరు చించి అత్రుతగా చదవసాగాను.

" ప్రియ నెచ్చెలి మైథిలీ" అన్న సంబోధన చదవటంతో నా కళ్ళలో నీళ్ళు తిరిగాయి. కళ్ళు తుడుచుకుని తిరిగి చదవసాగాను.

**"ఆడదాని జీవితానికి పెళ్లి భద్రత కల్గిస్తుంది' అనే అమ్మమ్మల కాలం నాటి నమ్మకాలు వమ్ము ఆయిపోతూన్న ఈ కాలంలో స్త్రీకి ఇల్లు వదిలి బైటికి రాక తప్పటం లేదు"**

నేను ఇంట్లో నుంచి లేచి పోయానని మా ఆయన చేసే ప్రచారం ఈపరికి నీకు తెలిసే వుంటుంది. మా మధ్య ఘర్షణకి కారణాలు నీకు కొన్నే తెలుసు. కానీ మీకెవ్వరికీ తెలియని కారణాలు యెన్నో యెన్నెన్నో. అందగాడూ, బ్యాంకు ఉద్యోగీ అయిన భర్త దొరికాడని పొంగి పోయాను కొత్తలో. తర్వాత కానీ ఆయనకి వున్న వ్యసనాలు తెలియదు. తాగుడు వ్యసనాన్ని భరించాను. గుర్రప్పందాల్లో డబ్బు తగలేయటం భరించాను. అమ్మాయిలతో తిరగటం భరించాను. యెందుకో తెలుసునా! నా ఒక్కగాను ఒక్క కూతురు జీవితం అభాసుపాలు కాకూడదని. దాని భవిష్యత్తు నాశనం కాకూడదని. ఎలాగోలా దాని పెళ్ళి అయి భర్త దగ్గరికి వెళ్ళి పోయింది. మా ఆయన చేసిన అప్పులకి ఇల్లు పోయింది. అయినా సామాన్య జీవితం గడపగలనని మనసుని శాంత పర్చుకున్నాను. అయినా విధి నన్ను ఇలా కూడా బ్రతకనీయకుండా చేసింది. ఎలాగో తెల్సునా! మా ఆయనకి ఓ భర్తపోయిన పాతికేళ్ళ స్త్రీ పరిచయం అయింది. ఆ పరిచయం పెరిగి ఆమెని నా ఇంటికే తెచ్చి మనతో బాటు వుంటుంది. నీకిష్టం వున్నా లేకపోయినా" అంటూ నిర్భయంగా, నిర్లక్ష్యంగా చెప్పే ఆయన్ని చూస్తే పరమ అసహ్యం వేసింది. చంపేయాలన్నంత కోపం వచ్చింది. "ఇది నా ఇల్లు, ఈయన నా మొగుడు" అంటూ ఆమెతో దెబ్బలాడి బైటికి గెంటివెయ్యాలని అన్పించినా ఆవేశాన్ని అణచుకుని ఆలోచించాను.

ముప్పైఏళ్ళ దాంపత్య జీవితానికి అర్థం లేకుండా మరో స్త్రీ మీద వ్యామోహంతో ఇంటికే తీసుకు వచ్చిన ఈయన్ని "నా భర్త" అనుకోవాలంటే రక్తం వుడికెత్తి పోయింది. ఈయన ప్రవర్తనతో ఎన్నో యేళ్ళుగా విసుగెత్తిన గుండెలో సహనం నసించింది" ఆడదాని జీవితానికి పెళ్ళి భద్రత కల్గిస్తుంది" అనే అమ్మమ్మల కాలం నాటి నమ్మకాలు వమ్ము అయి పోతూన్న ఈ కాలంలో స్త్రీకి ఇల్లు వదిలి బైటకి రాక తప్పటం లేదు. అయినా నాకు భయం లేదు మైథిలీ. నా కాళ్ళ మీద నేను నిలబడగలిగే అవకాశం కోసం వెతుక్కుంటున్నాను. యిలాంటి పరిస్థితిలో నన్ను అభిమానించినా, దూషించినా నీ యిష్టం.

ఇట్లు
జానకి

జానకి వుత్తరం చదవటం పూర్తిచేసి భారమైన గుండెని చేత్తో పట్టుకుని మంచం మీద వెనక్కి వాలాను. శ్రీవారు యెక్కడికి వెళ్ళారో యింకా రాలేదు. సమయం యెంత సేపు గడిచిందో నాకు తెలియదు.

"ఏంవోయ్. బైట మబ్బు మబ్బుగా వుంది. గరం గరంగా కాసిని వుల్లిపాయ పకోడీలు చెయ్యి" అన్న శ్రీవారి మాటకి ఒళ్ళు మండింది. వెధవ జీవితం. అంతా శ్రీవారి తల్లిదండ్రులకీ, అన్నదమ్ములకీ, వారి బంధుజనం కష్ట నష్టాలకీ సాయపడడం తప్ప నాకేం కావాలో ఒక్క క్షణం ఆలోచించే ఆలోచనే లేని ఈయనకి ఎన్ని సంవత్సరాలు చాకిరీ చేయను. ఒద్దు. ఈ నిస్సారమైన జీవితం నా కొద్దు. ఈ ఇంట్లో బందీని కాకూడదు. జానకిలా ఈ విశాల ప్రపంచంలోకి వెళ్ళిపోయి నాకు నేనుగా బ్రతకాలి. ఈ ఆలోచన ఇంతై అంతై కొండంతగా పెరిగి పోసాగింది. ఆవేశంతో గుండె కొట్టుకోసాగింది. ఆవేశంతో లేచి నాలుగు చీరెలు ఓ సూట్‌కేసులో సర్ది మూతవేశాను.

"ఎక్కడికి వెడతావ్" అంతరాత్మ నిలదీసింది.

"ఛీ నోరు మూసుకో!" అని మందలించానే కానీ ఎక్కడికి వెడతావ్ అన్న ప్రశ్న నన్ను నిలవనీయటం లేదు. తల తిరిగి పోసాగింది. ఒళ్ళు తూలసాగింది. క్రిందపడి పోతూన్నట్లు అన్పించింది. అంతే. ఆ తర్వాత ఏమైందో నాకు తెలియదు.

## 3

తెలివి వచ్చి కళ్ళు తెరిచేసరికి శ్రీవారు అత్రుతగా చూస్తూ కన్పించారు. కాసేపు ఏమైందో తెలియదు. కానీ తర్వాత జరిగిన ఒక్కో విషయం వరసగా గుర్తుకు రాసాగింది. డాక్టర్ వచ్చి చూసి మరేం ఫర్లేదు. కాస్త రెస్టుగా వుండాలి" అంటూ వెళ్ళిపోయింది. శ్రీవారు నా చేతిని తన చేతిలోకి తీసుకున్నారు. "మైథిలీ జీవితంలో నాకన్నీ తెలుసు అనుకున్నాను యిన్నాళ్ళూ కానీ భార్య మనోభావాలు ఏమిటో తెలుసుకోవటం, దానికి వీలైనంత అనుగుణంగా నడుచుకోవటం పురుషుడి కర్తవ్యం అన్న విషయం నాకు జానకి వుత్తరం చదివిన తర్వాత తెలిసింది. అమూల్యమైన విషయం తెలుసుకున్నందుకు ఆనందిస్తూన్నాను. జానక్కి మనం చేయగలిగిన సాయం చేద్దాం. ఆమె ఆత్మగౌరావాన్ని కాపాడుకునే" అంటూ శ్రీవారు మరో చెప్తూ వుంటే మొదట కాస్సేపు అర్థం కాకున్నా తర్వాత ప్రతి పదం అర్థమైన మనసు సంతోషంతో గాలిలో తేలిపోసాగింది. ఈయనలోని పసి మనసుని అర్థం చేసుకోకుండా యెంత తప్పుగా ఆలోచించాను. "పురుషుడు తల్లి దగ్గరా, భార్య దగ్గరా మాత్రమే తన సహజమైన మనస్తత్వాన్ని బహిర్గతం చేస్తాడు" అమ్మమ్మ యెప్పుడో అన్న మాటలు గుర్తుకి వచ్చాయి. ఆ మాటలు అక్షరం అక్షరం నిజం అన్పించింది. మైథిలీ ఏంటి ఆలోచిస్తున్నావ్" అంటూన్న శ్రీవారి కళ్ళలోకి చూస్తూ "ఈ కొత్త పిలుపు?" అన్నాను వచ్చే నవ్వుని ఆపుకుంటూ.

"ఒద్దు. ఆ పాత పిలుపు ఏంవోయ్ అనే అనండి"

"అనను. అనునుగాక అనను" అంటూ శ్రీవారు నన్ను దగ్గరగా తీసుకున్నారు. ఆయన మళ్ళీ యెప్పుడూ 'ఏవోయ్' అనలేదు.